



వైభవంగా మహా పూర్ణాహుతి

ఒంగోలు మెట్రో: స్థానిక హరిహరసుత అయ్యప్పస్వామి దేవస్థానంలో పరివార దేవత సహిత అయ్యప్పస్వామి 27వ ప్రతిష్ఠ దిన, అష్టబంధన మహా సంప్రోక్షణ మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. గురువారం ఆలయ ప్రధాన అర్చకులు పరాంకుశం కేశవాచార్యులు ఆధ్వర్యంలో అర్చక స్వాములు పరాంకుశ చక్రవర్తి, రంగస్వామి, సమీర్, ప్రాతఃకాలమున విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, అలంకరణ, మహా పూర్ణాహుతి కలశ స్నపనం, శుద్ధి, బింబ కళావాహనం, గో దర్శనం, కుంభ దర్శనం, అధర్శ దర్శనం, ధాన్య, కన్యాదర్శనం, అక్షితరోపణం, బ్రహ్మ ఘోష, మహదాశీర్వచనం, దీక్ష విరమణ, నివేదన, హారతి, తీర్థ ప్రసాద వితరణ జరిపించారు.

బాల్య వివాహాలు జరగకుండా చూడాలి

కొత్తపట్నం: ప్రతి గ్రామంలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని సీడీపీవో రాజకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గ్రామ సంరక్షణ అధికారులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, వీఆర్వోలు, ఏఎన్ఎంలకు బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు.

రుసుం చెల్లించాల్సిన అవసరం లేదు

ఒంగోలు అర్బన్: ఇంటి వరకు వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే వారికి 15 కిలో మీటర్లలోపు ఎటువంటి రుసుంను డెలివరీ బాయ్‌లకు చెల్లించాల్సిన అవసరం లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. డెలివరీ బాయ్స్ గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలో డబ్బు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ విషయం గమనించాలని, నిబంధనల మేరకు గ్రామీణ, పట్టణ, సెమీ అర్బన్ ప్రాంతాల్లోని అన్ని గ్యాస్ ఏజెన్సీలకు 15 కిలోమీటర్లలోపు డెలివరీ చార్జ్ ఉండదని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే సదరు ఏజెన్సీలపై చర్యలు తప్పవన్నారు. మరింత సమాచారం, ఫిర్యాదుల కోసం నేరుగా జిల్లా పౌర సరఫరాల కార్యాలయం ఫోన్ 8008301512 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.



